క్లుప్తంగా

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



సినీనటి రాధిక, మాజీ మంత్రి విశ్వరూప్, సినీ నటుడు అల్లు అర్జున్ సతీమణి స్నేహారెడ్డి

తిరుమల: సినీనటి రాధిక, మాజీ మంత్రి విశ్వరూప్, అల్లు అర్జున్ సతీమణి స్నేహారెడ్డి గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం పలికారు. టీటీడీ అధికారులు లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

సహాయక చర్యలు చేపట్టండి

తిరుపతి కల్చరల్: తుపాను కారణంగా జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రెవెన్యూ సదస్సులను వాయిదా వేసి లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మురంగా చేపట్టాలని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు వందవాసి నాగరాజు, పి.మురళి గురువారం వేర్వేరు ప్రకటనల్లో విజ్ఞప్తి చేశారు. గతంలో నిండిన చెరువులకు గండ్లు పడే అవకాశం ఎక్కువగా ఉందని, కళాశాలలు, పాఠశాలలకు సెలవులు ప్రకటించాలని కోరారు. పలు ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యలు, స్లమ్ ఏరియాల్లో ఏరియాల్లో ఇళ్లు కూలిపోవడం వంటి సమస్యలు ఉన్నాయని, వారికి ప్రభుత్వం నుంచి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు.

14న గంగమ్మ ఆలయంలో వేలం

తిరుపతి కల్చరల్ : శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఏడాది పాటు వివిధ పనుల లీజు పనుల నిమిత్తం ఈనెల 14న శనివారం ఉదయం 11 గంటలకు అమ్మవారి ఆలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ ఏ.జయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో అమ్మవారికి భక్తులు సమర్పించే చీరలు, రవిక పీసుల స్వీకరణ, కొబ్బరి చిప్పల సేకరణ, వెయ్యి కళ్ల దుత్తల విక్రయం, సజీవ కోళ్ల సేకరణ, పాదరక్షలు భద్రపరచి రుసుము వసూలు..మొదలైన వాటికి సంబంధించి ఏడాది లీజు హక్కు కోసం ఈ వేలం ఉంటుందని, ఆసక్తి గల వారు మరిన్ని వివరాలకు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

మహా భారత ప్రవచనాలు ప్రారంభం



ప్రవచనకర్త గరికపాటి రమేష్‌బాబు

తిరుపతి కల్చరల్: టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో 10 రోజుల పాటు తలపెట్టిన మహాభారత ప్రవచనాల కార్యక్రమం గురువారం సాయంత్రం అన్నమాచార్య కళామందిరంలో ఘనంగా ప్రారంభమైంది. తొలిరోజు ప్రవచనకర్త గరికపాటి రమేష్‌బాబు మహాభారతం ఆదిపర్వాన్ని కళ్లకు కట్టినట్లు వివరించారు. ప్రవచన కర్తను రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అన్నమాచార్య కళామందిరం ప్రోగ్రాం అధికారి కోకిల, రంగస్థలి కళాకారులు పాల్గొన్నారు.

'మేకల బండ'కు లిటరరీ ట్రస్టు పురస్కారం



రచయిత ఆర్‌సీ.కృష్ణస్వామి రాజు

తిరుపతి కల్చరల్: నగరానికి చెందిన ప్రముఖ రచయిత ఆర్సీ కృష్ణస్వామి రాజు రచించిన మేకల బండ నవలకు అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్టు పురస్కారం లభించిందని ఆ ట్రస్టు కార్యదర్శి డి.స్వప్న ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లా పుత్తూరు ఈశ్వరాపురం గోవిందపాదం చుట్టూ తిరిగే నేపథ్యంలో తప్పించుకున్న జీవాలను వెదకే ప్రయత్నం చేసే నలుగురి వెతలపై ఈ నవలా రచన సాగిందని తెలిపారు. చిత్తూరు జిల్లా యాసతో, సామెతలతో, నానుడులతో ఈ నవల ఎంతో ఆసక్తికరంగా నడవడంతో ఈ నవలను లిటరరీ ట్రస్టు పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఈనెల 24న హనుమకొండలో నిర్వహించే కార్యక్రమంలో రచయితకు రూ.5 వేలు నగదుతో పాటు ప్రశంసాపత్రం అందజేసి. సత్కరించనున్నట్లు తెలిపారు.

నేడు తిరుపతికి కావేరి వైద్యుల రాక

తిరుపతి తుడా: తిరుపతిలోని రేడియంట్ హాస్పిటల్‌కు చెన్నైలోని కావేరి ఆసుపత్రికి చెందిన సీనియర్ వైద్యులు విచ్చేయనున్నట్లు ఆ ఆస్పత్రి యాజమాన్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. నెఫ్రాలజీ వైద్య నిపుణులు డాక్టర్ ఎస్‌కే గణేష్ ప్రసాద్, గ్యాస్ట్రో అండ్ లివర్ విభాగ వైద్యనిపుణులు డాక్టర్ నీలేంద్ర శుక్రవారం తమ హాస్పిటల్‌లో ఓపీలు చూస్తారని, దీనిని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరింది.

జనజీవనం అస్తవ్యస్తం

ఎడతెరపి లేని కుండపోత వర్షంతో తిరుపతి నగర ప్రజానీకం ఇబ్బందులు పడింది. బుధవారం రాత్రి పది గంటల ప్రాంతంలో మొదలైన వర్షం గురువారమంతా కొనసాగింది. ఫలితంగా నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తిరుపతిలోని ప్రధాన కాలువలతో పాటు మురుగు కాలువలు వర్షపు నీటి ప్రవాహంతో పొంగి ప్రవహించాయి. తుపాను ప్రభావం శుక్రవారం కూడా కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

- కుండపోత వర్షానికి తిరుపతి విలవిల
- పొంగి ప్రవహించిన కాలువలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- నగరంలో విస్తృతంగా సహాయక చర్యలు



తిరుపతి లక్ష్మీపురం సర్కిల్‌లో నదీ ప్రవాహాన్ని తలపిస్తున్న వర్షపు నీరు.. నీటి వేగానికి కొట్టుకు వచ్చిన ద్విచక్రవాహనం (వృత్తంలో)

తిరుపతి తుడా: అల్పపీడనం ప్రభావం తిరుపతిపై అధికంగా కనిపించింది. బుధవారం రాత్రి నుంచే భారీ వర్షంతో మొదలవ్వడంతో తిరుపతిలో వర్షపు నీరు ఏరులై పారింది. జోరు వానతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షానికి నగరంలోని లోతట్టు ప్రాంతాల్లోకి పెద్ద ఎత్తున వర్షపు నీరు చేరింది. మధురానగర్, మాధవ నగర్, ఎర్రమిట్ట , కొర్లగుంట, మారుతి నగర్, కొరమేనుగుంట, గొల్లవాని గుంట, లక్ష్మీపురం సర్కిల్, ఎస్టీవీ నగర్, గాంధీపురం, శ్రీనివాసపురం, ఆటో నగర్, కట్టకింద పల్లె, శివజ్యోతి నగర్, అశోక్ నగర్, బండ్ల వీధి తదితర ప్రాంతాల్లో వర్షపునీరు నిండిపోయింది. కొన్ని ప్రాంతాల్లో మోకాలిలోతు పైగా వర్షపునీటికితోడు మురుగునీరు రోడ్లపై చేరడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని మోటార్ సైకిళ్లు, ఆటో ఇంజిన్లలోకి నీళ్లు చేరి మొరాయించడంతో వాటిని అగచాట్లు పడుతూ తోసుకెళ్లడం కనిపించింది. ఇక రైల్వే స్టేషన్, డీఆర్ మహల్ రైల్వే అండర్ బ్రిడ్జిలలోకి వర్షపు నీరు చేరుతుండడంతో అధికారులు ఎప్పటికప్పుడు మోటార్లతో నీటి తోడివేతకు చర్యలు తీసుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ముమ్మరంగా సహాయక చర్యలు

భారీ వర్షాల నేపథ్యంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఇంజినీరింగ్ ప్రజా ఆరోగ్య శాఖ సంయుక్తంగా సహాయక చర్యలను పర్యవేక్షించారు.

జనం ఇళ్లకే పరిమితం

ఎడతెరపిలేని వర్షం ధాటికి నగర ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. చాలామంది ఉద్యోగులు సైతం సెలవు పెట్టి ఇళ్లలోనే ఉండిపోయారు. నగరంలో వ్యాపారం పూర్తిగా దెబ్బతింది.

నిండుకుండలా చెరువులు

చంద్రగిరి: మండల వ్యాప్తంగా గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు వర్షం దంచి కొట్టింది. వెంకటపేట, పేట ప్రధాన రహదారిపై మోకాలు లోతు వర్షపు నీరు చేరడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఈదురుగాలులు వీయడంతో చలి తీవ్రత అధికమైంది. ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు 56.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మండలంలోని చెరువులు దాదాపు నిండుకుండలను తలపిస్తున్నాయి. ఇప్పటికే కొండ్రెడ్డికండ్రిగ, ఊట్లకోన, అరిగెలవారిపల్లె చెరువులు పూర్తిగా నిండినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. మరోవైపు స్వర్ణముఖి జోరుగా ప్రవహిస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పొంగి పొర్లుతున్న వాగులు..వంకలు

పాకాల: మండలంలో బుధవారం రాత్రి నుంచి కుండపోతగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. అధికంగా నీరు రోడ్లపై ప్రవహించడంతో పలు ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం కలిగింది. పాకాల–చిత్తూరు మార్గంలోని వంక, పాకాల–దామలచెరువు మార్గంలోని ఆంజనేయస్వామి ఆలయానికి సమీపంలో ఉన్న వంక ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇలాగే వర్షాలు అధికంగా మరో రెండు రోజుల పాటు కురిస్తే అన్ని చెరువులు మొరవలు పోతాయి. వాహనదారులు వంకలు ప్రవహిస్తున్న ప్రదేశాల్లో జాగ్రత్తగా వెళ్లాలని స్థానిక పోలీసులు హెచ్చరించారు.

పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు

రామచంద్రాపురం: మండల వ్యాప్తంగా రెండురోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు వంకలు, వాగులు పొంగి పొర్లుతున్నాయి. అనుప్పల్లె వద్ద ఉన్న పెద్దేటి వంక ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాయలచెరువులో నీటిమట్టం పెరిగింది. కమ్మపల్లె గ్రామ సమీపంలోని అమ్మగారి చెరువుకట్ట లీకేజీ అవుతోందని గ్రామస్తులు అధికారులకు తెలియజేశారు. ఈ నేపథ్యంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీఓ ఇందిర, ఇరిగేషన్ ఏఈ ఎత్తిరాజులు అమ్మగారి చెరువు వద్దకు చేరుకుని పరిశీలించారు. నడవలూరు సమీపంలోని నక్కలవంక ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. ఇక, నెత్తకుప్పం పంచాయతీ ఎల్వీపురానికి చెందిన కామసాని మునిలక్ష్మి పాడిఆవు చీకటికోన వాగు ప్రవాహంలో కొట్టుకుపోయి మృతి చెందినట్లు బాధితురాలు కన్నీరుమున్నీరైంది.

దెబ్బతిన్న పంటలు


భాకరాపేట : భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం పడుతూనే ఉంది. దీంతో చెరువుల్లోకి భారీగా వర్షపు నీరు వచ్చి చేరింది. వరి, వేరుశనగ పంటలు నీట మునిగాయి. భారీ వర్షాలకు టమాట రైతులు ఆందోళన చెందుతున్నారు.

జలమయమైన మల్లెలవాండ్లపల్లె

భాకరాపేట : మండలంలోని దేవరకొండ పంచాయతీ మల్లెలవాండ్లపల్లె గ్రామం జలమయమైంది. బుధవారం అర్ధరాత్రి నుంచి శేషాచల అటవీ ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. దీంతో అటవీ సరిహద్దు గ్రామాల్లో వర్షపు నీరు భారీగా ప్రవహించింది. మల్లెలవాండ్లపల్లెలో సిమెంటు రోడ్డు ఉన్నా రోడ్డుకు ఇరువైపులా కాలువలు లేకపోవడంతో రోడ్డుపై మోకాలి లోతు నీళ్లు నిలిచి ఇళ్లలోకి ప్రవేశిస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు.

కల్యాణికి పోటెత్తిన వరద

చంద్రగిరి: పోలీసు ట్రైనింగ్ కాలేజీ సమీపంలోని కల్యాణి డ్యామ్‌కు భారీగా వరద నీరు చేరుతోంది. 15 రోజుల క్రితం వరకు డ్యామ్‌లో నీటి మట్టం పూర్తిగా పడిపోయి డెడ్ స్టోరేజ్‌కు వచ్చింది. ఈ నేపథ్యంలో 10 రోజుల క్రితం తుపాను కారణంగా శేషాచల అటవీ ప్రాంతాల నుంచి వంకలు సాగి వర్షపు నీరు చేరింది. అలాగే గురువారం కుండపోత వర్షం మూలాన సాయంత్రం 4 గంటల నాటికి 864 అడుగుల వరకు నీరు చేరిందని అధికారులు గుర్తించారు.



జలకళలాడుతున్న కల్యాణి డ్యామ్

వరద ముంపులో కేబీఆర్ నగర్

- మోకాలిలోతు నీటిలో పర్యటించిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి
- వంతెన నిర్మాణానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని హామీ



కేబీఆర్ నగర్‌లో పర్యటిస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుపతి మంగళం: తిరుమల నగర్ పంచాయతీ కేబీఆర్ నగర్ వాసులు వరద ముంపులో భయం భయంగా గడుపుతున్నారు.. ఇది తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గురువారం సాయంత్రం ఆ గ్రామంలో పర్యటించి స్థానికులకు ధైర్యం చెప్పారు. మోకాలి లోతు నీటిలో అక్కడ పర్యటించారు. 2007లో ఏర్పాటైన కేబీఆర్ నగర్‌ను ఎవరూ పట్టించుకోలేదని, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు ఏర్పాటు చేశారని, ఆ వంతెన నిర్మాణం కూడా మీరే చేయాలని స్థానికులు మోహిత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆ వంతెన నిర్మాణానికి ప్రస్తుత ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని వారికి హామీ ఇచ్చారు. ఎవరికి ఏ అవసరమొచ్చినా తనకు సమాచారం ఇస్తే వారికి సాయం చేయడానికి సిద్ధంగా ఉంటానన్నారు. ఆ తర్వాత గ్రామంలోని ఇళ్లలోకి చేరిన వరద నీరు, వంతెన నిర్మాణం చేయాల్సిన ప్రాంతాలను గ్రామస్తులు మోహిత్ రెడ్డికి చూపించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





చంద్రగిరి: చంద్రగిరి–వెంకటంపేట వద్ద మోకాలి లోతు వర్షపు నీరు చేసిన దృశ్యం, తిరుపతి తుడా: వరద నీటిలో ఆగిన వాహనాలను నెట్టుకొస్తున్న ప్రజల తిప్పలు, శ్రీనివాసపురం వయా తిరుచానూరు ప్రధాన మార్గంలో వర్షపు నీరు






మడుగును తలపిస్తున్న వెస్ట్ చర్చి అండర్ బ్రిడ్జి వద్ద పోలీస్ కాపలా, లక్ష్మీపురం సర్కిల్ వద్ద అంత్యక్రియల కోసం జోరు వానలో..., నడవలూరు సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న నక్కలవంక, పాకాల: ఆంజనేయస్వామి ఆలయానికి సమీపంలో కల్వర్టుపై ఇలా..

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- హెల్ప్ లైన్ నెంబర్లు 08772256766, 9000822909



లోతట్టు ప్రాంతాలలో ప్రజల నివాసాలను పరిశీలిస్తున్న కమిషనర్



పూలవానిగుంటలో ఇంట్లోకి చేరిన వర్షపు నీరు

తిరుపతి తుడా: భారీ వర్షాల నేపథ్యంలో నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప బయట రావద్దని కమిషనర్ ఎన్ మౌర్య హెచ్చరించారు. గురువారం నగరంలోని లోతట్టు ప్రాంతాలైన కొరమేనుగుంట, గొల్లవానిగుంట, ఆటోనగర్, పూలవాని గుంట, లక్ష్మీపురం కూడలి, బాలాజి కాలని, డీఆర్.మహల్ రోడ్డు, అండర్ బ్రిడ్జి, కేశవాయనగుంట, నారాయణపురం తదితర ప్రాంతాల్లో ఆమె పర్యవేక్షించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. నగరంలో నీరు నిలవకుండా మురుగు కాలువల్లో చెత్త తొలగిస్తున్నామని, అండర్ బ్రిడ్జిల వద్ద నీరు నిలిస్తే తొలగించేందుకు మోటార్లు సిద్ధంగా ఉంచామని తెలిపారు. చెట్లు కిందపడినా, కొమ్మలను తొలగించేందుకు సిబ్బందిని సిద్ధంగా ఉంచామని, లోతట్టు ప్రాంతాల్లోనూ, ఇబ్బందులు ఎదుర్కొనే ప్రజల కోసం ప్రత్యేకంగా 17 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అందులో అన్ని సౌకర్యాలు కల్పించామని, తమ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారని చెప్పారు.

పునరావాస కేంద్రాలివే..!

1. పోస్టల్ కాలనీలోని పార్వతీపురం, నగరపాలక సంస్థ పాఠశాల
2. మంగళం తుడా క్వార్టర్స్ వద్ద ఎంపీపీ స్కూల్
3. కొత్తపల్లి, ప్రైమరీ స్కూల్
4. కొరమేనుగుంట రాజీవ్ గాంధీ స్కూల్
5. ఆర్ఎస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్
6. మధురానగర్‌లోని ఎంసీయూపీ స్కూల్
7. మధురానగర్‌లోని ప్రియదర్శిని ఇంగ్లిష్ మీడియం స్కూల్
8. సంజయ్ గాంధీ కాలనీలోని ఎంయూపీస్కూల్
9. సత్యనారాయణపురంలోని జెడ్పీ స్కూల్
10. కెనడి నగర్‌లోని డి.అడిక్షన్ సెంటర్
11. ఎర్రమిట్టలోని రత్నం, చైతన్య స్కూల్
12. సింగాలగుంట మునిసిపల్ స్కూల్
13. ఉప్పంగి హరిజనవాడ మునిసిపల్ స్కూల్
14. యశోదా నగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్
15. బైరాగిపట్టెడలోని రామానాయుడు స్కూల్
16. ఎల్.బి.నగర్‌లోని కేశవరెడ్డి స్కూల్
17. వేశాలమ్మ గుడి వీధి లోని ఇందిరా నగర్ స్కూల్

ఆయా కేంద్రాలకు ఇన్‌చార్జ్ అధికారులను నియమించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా హెల్ప్ లైన్ నంబర్లు 0877 2256766, 9000822909ను సంప్రదించాలని కమిషనర్ తెలిపారు.


అన్నమయ్య గృహాన్ని పునర్నిర్మాణం చేయాలి



విజయశంకర స్వామి

తిరుపతి కల్చరల్: తిరుమలలో తొలగించిన అన్నమయ్య గృహాన్ని పునర్నిర్మాణం చేయాలని, తొలగించిన పవిత్ర దేవతామూర్తుల విగ్రహాలను పునఃప్రతిష్ఠాపన చేయాలని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి టీటీడీని డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నమయ్య విశిష్టతను చాటడంతో పాటు ఆయన సంకీర్తనలను గ్రామీణ ప్రజల దరికి చేర్చాలనే సంకల్పంతో తమ కళాక్షేత్రం నిరంతరం కృషి చేస్తోందన్నారు. బుధవారం కళాక్షేత్రం నుంచి టీటీడీ పరిపాలనా భవనం వరకు వేలాది మంది భక్తులతో హరి నామసంకీర్తనల ఆలాపనతో శోభాయాత్ర నిర్వహించి వివిధ డిమాండ్లతో వినతి పత్రం టీటీడీ జేఈఓ వీరబ్రహ్మంకు ఇచ్చామని పైవిధంగా చేసిన డిమాండ్ గురించి చెప్పారు. అలాగే టీటీడీ అనుబంధ పుణ్యక్షేత్రాలన్నింటా అఖండ నామ సంకీర్తన చేసేదిశగా ఏర్పాట్లు చేయాలని, జానపద కళా గురువులకు గౌరవవేతనం కల్పించాలని కోరినట్లు తెలియజేశారు. తమ డిమాండ్లపై టీటీడీ నెల రోజుల లోపు స్పందించకపోతే ఫిబ్రవరి 22న టీటీడీ పరిపాలన భవనం వద్ద ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జైభారత్ జాతీయ కార్యదర్శి లోకనాథ్, హిందూస్ ఫర్ ప్లూరాలిటీ అండ్ ఈక్వాలిటీ జాతీయ అధికార ప్రతినిధి మల్లికావల్లభ, జైహో సంస్థ రాష్ట్ర నేత మహేష్ పాల్గొన్నారు.

16న ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయం వద్ద ధర్నా



మాట్లాడుతున్న ఏపీ ఎలక్ట్రికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్

తిరుపతి కల్చరల్: తొలగించిన విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుడిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16న ఉదయం 10 గంటలకు ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.సుధాకర్ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నైపుణ్యం కలిగిన గణేష్ అనే కార్మికుడు 2006 నుంచి పని చేస్తున్నాడని, అయితే వారి ఊరిలో జరిగిన ఓ సంఘటనలో అతనిపై పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ కావడంతో దీనికి సాకుగా చూపుతూ విధుల నుంచి తొలగించారని, అయితే విచారణ తర్వాత ఆ కార్మికుడి తప్పు లేదని కోర్టు క్యాన్సిలేషన్ ఆర్డర్ ఇచ్చిందన్నారు. దీనిపై కార్మికుడిని తిరిగి విధుల్లోకి తీసుకొని ఎన్నోసార్లు ట్రాన్స్‌కో ఎస్ఈ, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు స్పందించకపోవడంతో ఆందోళన చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు దివాకర్‌రెడ్డి, గుణ, శరవణ, బాధితుడు గణేష్, వేదవతి, రాజు పాల్గొన్నారు.